

- ఒకేసారి రూ.2లక్షల మాఫీకి ప్రభుత్వం కసరత్తు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు చెల్లించేందుకు ప్రణాళిక
- అర్హతలపై మార్గదర్శకాలు రూపొందిస్తున్న సర్కారు
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపై అధ్యయనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90లక్షల మందికి రైతుబంధు పథకం
- 3.82లక్షల మందికి సమ్మాన్ నిధి ద్వారా పెట్టుబడి సాయం
- రుణమాఫీకి సుమారు రూ.8వేల కోట్లు అవసరంగా అంచనా

రుణమాఫీ.. రైతు శ్వాస



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రైతులకు రూ.2లక్షల రుణాన్ని ఒకే విడతలో మాఫీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీపై హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్‌లో సుమారు 8లక్షల మంది రైతులకు సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరుగవచ్చునని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే రుణమాఫీని ఎలా చేయాలనే దానిపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకేఎస్) పథకంలోని విధివిధానాలపై అధ్యయనం చేస్తున్నారు. కొన్ని మార్పులు, చేర్పులతో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఓరుగల్లు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 9వ తేదీ కటాఫ్

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు పక్కాగారూ.2లక్షల రుణమాఫీ చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. దీనిపై ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రిమండలి ఉపసంఘాన్ని కూడా నియమించారు. ఉపసంఘానికి రుణమాఫీపై పలువురు నుంచి పలు ప్రతిపాదనలు వస్తున్నాయి. అలాగే రూ.2లక్షల రుణమాఫీకి 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ మధ్యకాలంలో రుణం తీసుకున్న రైతులకే రుణమాఫీ చేయనున్నారు. ఈ ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణంపై వడ్డీని కూడా లెక్కించి మొత్తంగా రూ.2లక్షల వరకు మాఫీ చేయనున్నారు. ఆపైన ఉన్న మొత్తాన్ని రైతులే బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ లోనులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మాఫీ చేసే అవకాశం లేదని సమాచారం.

విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు

పంద్రాగస్టులోపు రుణమాఫీ చేయాలని తీవ్ర కసరత్తు చేస్తున్న సర్కారు.. ఎవరికి వర్తింపజేయాలనే దానిపై తర్జనభర్జన పడుతోంది. వివిధ వర్గాల నుంచి ప్రభుత్వానికి పలు ప్రతిపాదనాలు వస్తుండగా.. ప్రధానంగా ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా రుణమాఫీ నుంచి తొలగించే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఐదెకరాల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేయాలనే ప్రతిపాదనలు కూడా వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపైనా అధ్యయనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పూర్తి విధివిధానాలను కాకపోయినా కొన్నిటిని అయినా పరిగణనలోకి తీసుకుంటునే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరో వైపు తెల్ల రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని కూడా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఒక ఇంట్లో ఒక్కరికే రుణమాఫీ వర్తిస్తుందని ప్రచారం జరుగుతుండగా.. ఇందుకోసం రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వివరాల సేకరణలో అధికారులు

కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రుణమాఫీకి అడుగులు వేస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలను పరిగణనలోకి తీసుకుంటే చాలా తక్కువ మందికి రుణమాఫీ జరుగుతుందని, అదే రైతుబంధు విధివిధానాలైతే అత్యధిక రైతులకు ప్రయోజనం చేకూరుతుందని లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 3,81,890 మంది రైతులు లబ్ధిపొందుతుండగా వీరికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.76,37,80,000 పెట్టుబడి సాయాన్ని అందించింది. అదే రైతు బంధు పథకం కింద అయితే 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో రైతుబంధు విధివిధానాలను కొంచెం మార్పులు, చేర్పులు చేసి అమలు చేస్తే ఉమ్మడి జిల్లాలో 8,89,787మంది రైతులు లబ్ధిపొందుతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సహకార బ్యాంకులతో పాటు జాతీయ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 34 సహకార బ్యాంకుల్లో 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ కానుండగా ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే జాతీయ బ్యాంకుల్లో కూడా వివరాలను సేకరిస్తుండగా.. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ లబ్ధిదారుల లెక్క తేలనుంది.

అన్నదాతల్లో ఆనందం

వానాకాలం సాగు ప్రారంభం కావటంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,81,890మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.76కోట్ల37లక్షల80వేల రుపాయలను జమ చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కూడా పెంచబోతోంది. జూలై మొదటి వారంలో వానాకాలం పెట్టుబడి సాయం అందించనుంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి పంటలకు రూ.పదివేల అందించింది. అయితే తాము అధకారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు అందనుంది. జూలైలో ఈ సాయాన్ని రైతుల ఖాతాలో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 2023-24 యాసింగిలో రైతుబంధు పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈసారి ఈ మొత్తం రూ.1,350కోట్లకు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొత్తానికి రూ.2లక్షల రుణమాఫీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి ద్వారా లబ్దిపొందుతున్నరైతుల వివరాలు

జిలా	రైతుబంధు	పెట్టుబడి సాయం	పీఎంకేఎస్	పెట్టుబడి సాయం
వరంగల్	1,54,822	రూ.137.46కోట్లు	65,361	రూ.13,07,22,000
హనుమకొండ	1,45,044	రూ.132.13కోట్లు	56,409	రూ.11,28,18,000
జనగామ	1,79,735	రూ.202.04కోట్లు	81,487	రూ.16,29,74,000
మహ-బాద్	2,14,685	రూ.233.07కోట్లు	90,978	రూ.18,19,56,000
భూపాలపలి	1,16,171	రూ.118.83కోట్లు	48,496	రూ.09,69,92,000
ములుగు	79,330	రూ.84.40కోట్లు	39,159	రూ.07,83,18,000
మొత్తం	8,89,787	రూ.907.93కోట్లు	3,81,890	రూ.76,37,80,000

కలెక్టరేట్ వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం

- తమ భూమిని వేరొకరికి పట్టా చేశారని మనస్తాపం
- పురుగుల మందు తాగగా ఆస్పత్రికి తరలించిన పోలీసులు

జనగామ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం కలెక్టరేట్ బిల్డింగ్ పైకి ఎక్కి పురుగుల మందు తాగగా పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా జనగామ మండలం పసరమడ్లకు చెందిన బాధితుడు నిమ్మాల నర్సింగరావు మాట్లాడుతూ తన తాత పేరు మీద పసరమడ్ల గ్రామంలోని పలు సర్వే నంబర్లలో 8 ఎకరాల భూమి ఉందని, దాన్ని తమకు తెలియకుండా దాయాదులకు అధికారులు పట్టా చేశారని ఆరోపించారు. తాము చనిపోయినట్లుగా తమ దాయాదులు చెప్పడంతో అప్పటి తహసీల్దార్ జె.రమేశ్, వీఆర్వో క్రాంతి 2017లో పట్టా చేశారని ఆరోపించారు. తాను బతుకు దెరువు కోసం కారు డ్రైవింగ్ చేసుకుంటూ ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఉంటున్నానని, దీన్ని అదనుగా తీసుకొని తన భూమిని అప్పటి అధికారులు అక్రమంగా పట్టా చేశారని అన్నారు. ఈ విషయంపై ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి పట్టా రద్దు కోసం తాను తిరుగుతుంటే తనను చంపడానికి దాయాదులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

కాగా, కలెక్టరేట్‌లో ప్రజావాణి జరుగుతున్న సమయంలో తను కలెక్టరేట్ బిల్డింగ్ పైకి ఎక్కి పురుగుల మందు తాగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనగామ సీఐ రఘుపతిరెడ్డి బిల్డింగ్ పైకి ఎక్కి నర్సింగరావుకు నచ్చజెప్పి చాకచక్యంగా కిందికి దించారు. అనంతరం తన వాహనంలోనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నర్సింగరావు పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా.. నర్సింగరావు ఆత్మహత్యకు యత్నించిన సమయంలో కలెక్టర్‌తో సహా అధికారులంతా ప్రజావాణిలోనే ఉన్నారు. ఆత్మహత్యాయత్నంతో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ కలెక్టర్ గానీ, ఇతర అధికారులు గానీ ఎవరూ చూడడానికి రాకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది సేపటి తర్వాత సమాచారం తెలుసుకున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ వచ్చి నచ్చజెప్పి నర్సింగరావును ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సింగరావు ఆరోగ్య పరిస్థితిని చూసేందుకు కూడా అధికారులు ఎవరూ రాకపోవడం విస్మయాన్ని కలిగించింది. ఈ ఘటనపై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను వివరణ కోరగా.. నర్సింగరావు భూమి అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందని అన్నారు.





కలెక్టరేట్ భవనంపై పురుగుల మందు తాగిన నర్సింగరావును కిందకు తీసుకువస్తున్న పోలీసులు

ప్రజావాణి ఫిర్యాదులపై
నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



కలెక్టర్‌కు దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు

జనగామ రూరల్, జూన్ 24: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 71 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అన్ని మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి అప్పటికప్పుడు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీసీఈవో అనిల్ కుమార్, డీఎస్‌వో రోజా రాణి, డీడబ్ల్యూవో జయంతి, డాఏవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి..

- అన్నెబోయిన మహేందర్, చిన్నరామన్‌చర్ల



మాది నిరుపేద కుటుంబం. 1997లో ఆంధ్రపదేశ్ సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు 1.13 గుంటల భూమి మా తండ్రి చిన్న మల్లయ్యకు ఇచ్చారు. అప్పటి నుంచి మా తండ్రి వ్యవసాయం చేసేవాడు. మేము బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాం. తండ్రి మరణించడంతో మళ్లీ స్వగ్రామానికి వచ్చాం. నాలుగు రోజుల క్రితం మా భూమిలో కొందరు వ్యక్తులు గుడిసెలు వేశారు. వాటిని తొలగించి మాకు న్యాయం చేయాలి.

పింఛన్ మంజూరు చేయాలి..

- వల్లూరి వెంకటనర్సు, రంగాపూర్



నాకు 2021లో కాలికి గాయమై సెప్టిక్ అయింది. 2022 సంవత్సరంలో సదరం క్యాంపులో పాల్గొనగా 65 శాతం, 2023లో 73 శాతం దివ్యాంగుడిగా సర్టిఫికెట్ అందజేశారు. రెండు సంవత్సరాల నుంచి కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. అయినా పింఛన్ రావడం లేదు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పింఛన్ మంజూరు చేయాలి.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి: కార్మిక సంఘం

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి ప్రతం అందజేశారు. ఉపాధి హామీ కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి 5వేల పింఛన్, అర్హులైన వారందరికీ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యకమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్ధన్, నాయకులు రాజు, రమేష్, రాములు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఫస్టియర్‌లో 60.29 శాతం, సెకండియర్‌లో 55.21 శాతం ఉత్తీర్ణత

జనగామ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియల్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో సప్లిమెంటరీ పరీక్షలకు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 2385 మంది హాజరవగా 1438 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా సెకండియర్ పరీక్షలకు 1610 మంది హాజరవగా 881 మంది పాస్ అయ్యారు. మొదటి సంవత్సరం ఉత్తీర్ణత 60.29 శాతం, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత 55.21 శాతంగా నమోదైంది. కాగా.. సప్లిమెంటరీ ఫలితాలలో పాస్ అయిన విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.ఆంజనేయరాజు ఒక ప్రకటనలో అభినందించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, జూన్ 24 : ప్రజలు సమస్యలతో అధికారుల వద్దకు వచ్చినపుడు వెంటనే స్పందించి, పరిష్కారం చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిఅ సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాలకుర్తి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సోమవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనుల అలసత్వంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరు పట్టణంలో పెద్ద చెరువు కట్ట పనులు ప్రారంభించాలని, దుబ్బతండా వద్ద నిర్మాణం పూర్తైన రెండు పడక గదుల ఇండ్లను సంబంధిత శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం శ్మశాన వాటికలో గతంలో మంజూరైన రూ.50 లక్షలు నిధులతో పనుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, సంతోష్, మాజీ కో-ఆప్షన్ ఎం.డీ యాకూబ్, కౌన్సిలర్‌లు దొంగరి రేవతి శంకర్, నాగరాజు, గజానంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

మునిసిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పగించాలనుకుంటున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవేందర్, శ్రీనివాస్, వెంకన్న, యాకూబ్, వెంకటరాంనర్సయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఈ హెచ్‌ఎం మాకొద్దు

కోమల్లలో గ్రామస్థుల ఆందోళన



హెచ్‌ఎం నర్సింహులుతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

రఘునాథపల్లి, జూన్ 24: ఇటీవల బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు తమకు వద్దంటూ కోమళ్లలో గ్రామస్థులు అందోళనకు దిగారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో జనగామ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోల నర్సింహులు ఈ నెల 13వ తేదీన కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. మరో రెండు సంవత్సరాలయితే ఉద్యోగ విరమణ పొందాల్సిన నర్సింహులు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడని, తను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు ఇబ్బందికరంగా ఉందని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న నర్సింహులు కుమారుడు రవి తేజ వచ్చి తన తండ్రి కొన్ని నెలలుగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడని, మానసిక వైద్య నిపుణుడికి చూపించామని, మందులు వాడుతున్నారని, సెలవు పెట్టి ఇంట్లో ఉండాలని తాము కోరినా వినడం లేదని వివరించారు.

డబుల్ రోడ్డున్నా...
సింగిల్ బస్సు రాదాయె..

- రవాణా సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, ప్రజలు
- ఉచిత బస్సు ప్రయాణం మాకేది అంటున్న మహిళలు



మచ్చుపహాడ్ - నర్మెట డబుల్ రోడ్డు

నర్మెట, జూన్ 24: రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతీ గ్రామానకి బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్తున్న నాయకుల మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. నర్మెట మండలంలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 17 గ్రామాలున్నా మండలకేంద్రంతో పాటు, హన్మంతాపూర్ గ్రామ ప్రజలు తప్ప మిగతా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే నానా యాతనపడి చేరుకోవాల్సి వస్తోంది. జనగామ, రఘునాథ్‌పల్లి నుంచి మచ్చుపహాడ్ మీదుగా నర్మెట మండలకేంద్రానికి డబుల్ రోడ్డు సౌకర్యం ఉన్నా సింగిల్ బస్సు కూడా రావడం లేదు. అదేవిధంగా అమ్మాపురం, గండిరామవరం, మల్కపేట, బొమ్మకూర్, గుంటూరుపల్లి, లోక్యతండ, మాన్‌సింగ్‌తండ గ్రామాల కు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యం లేదు. జనగాం నుంచి రఘునాథ్‌పల్లి, నర్మెట, చేర్యాల మీదుగా సిద్దిపేట వరకు బస్సులు నడిపించాలని గతంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి మండల ప్రజలు వినతిపత్రం అందించినా ఇంతవరకు ప్రయోజనం లేదు. మండల పరిషత్‌లో ప్రతీ మూడు నెలలకు నిర్వహించే సర్వసభ్య సమావేశంలో అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చి ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మచ్చుపహాడ్ కాంగ్రెస్ నాయకులు జనగామ డిపో మేనేజర్‌కు వినతిపత్రం కూడా అందించారు.



జనగామ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న మచ్చుపహాడ్ కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

బస్సు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అధిక వ్యయంతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మాకు అందడం లేదని ఆయా గ్రామాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రైవేట్ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండడంతో నర్మెట మండలం నుంచే కాక ఇతర మండలాల నుంచి కూడా నిత్యం వెయ్యి మందికి పైగా విద్యార్థులు వచ్చిపోతున్నారు. విద్యార్థులతో పాటు మండలకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అదికారులు స్పందించి అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మచ్చుపహాడ్ మీదుగా బస్సులు నడిపించాలి..

- పరీదుల లింగరాజు, మచ్చుపహాడ్



మచ్చుపహాడ్ గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు రావడం లేదు. గ్రామం చూట్టూ తండాలు ఉన్నాయి. బస్సులు రాకపోవడంతో ఆటో, జీపు ప్రైవేట్ వాహనాలల్లోనే వెళ్తున్నాం. విద్యార్థులు ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నడిపించాలని జనగామ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించాము. త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

బిర్యానీ సెంటర్లనూ వదలని ఖాకీలు!

పెట్రోలింగ్ పోలీసుల చేతివాటం

రాత్రి వేళల్లో బిర్యానీ పొట్లాలు, చిల్లర వసూళ్లు

వరంగల్ క్రైం, జూన్ 24: కొంతమంది పోలీసుల వైఖరితో ఆ శాఖ పరువు పోతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు పోలీసు అధికారులు అందినకాడికి దండుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. రోజువారి వసూళ్లకు తెగబడుతున్న పలువురు పోలీసులు.. చివరకు బిర్యానీ సెంటర్లను సైతం వదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రైసిటీస్‌లో ఉన్న బిర్యానీ సెంటర్ల యజమానులు పోలీసులు వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు.. బిర్యానీ సెంటర్లను వదలడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా కాజీపేట సెంటర్, హనుమకొండ, వరంగల్ బస్టాండ్ ఏరియాల్లో పోలీసుల చేతివాటం ఎక్కువగా ఉంటోందని సమాచారం. ప్రస్తుతం నగరంలో బిర్యానీ సెంటర్ల జోరు ఎక్కువగా ఉండటంతో పోలీసులు సైతం అదే స్థాయిలో వీరి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. రాత్రి వేళల్లో బిర్యానీ సెంటర్ల నుంచి ప్యాకింగ్‌లు తీసుకెళ్లడంతోపాటు వ్యాపారాన్ని బట్టి వసూళ్ల చేస్తున్నట్లు సమాచారం. ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులు సైతం లంచ్‌లు, డిన్నర్‌లకు బిర్యానీ సెంటర్లపై పడుతున్నట్లు తెలిసింది. స్టేషన్‌ల పరిధిలో ఉన్న పలు బిర్యానీ సెంటర్లకు ఈ నష్టం తప్పడం లేదనే ఆరోపణలున్నాయి. స్టేషన్ నుంచి వచ్చిన ఆర్డర్ అందించకుంటే ఆ బిర్యానీ సెంటర్‌కు రాత్రి వేళ పెట్రోలింగ్ సమయంలో ఇక్కట్లు తప్పవనే ప్రచారం ఉంది. డబ్బులు అడిగే పరిస్థితి ఉండదని సమాచారం. బిర్యానీ సెంటర్ల యజమానులు తెలిసిన వారివద్ద గోడువెళ్లగక్కడం మినహా బయటికి చెప్పుకోలేని పరిస్థితి. నిఘా విభాగం అధికారులకు ఈ దందా గురించి తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారనే విమర్శలున్నాయి.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



దాడులు చేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, జూన్ 24: నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వపెట్టుకున్న కిరాణం షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కిరాణం షాపులో గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. స్థానిక పోలీసులతో కలిసి సోమవారం దాడులు చేశారు. రూ. 9,780 విలువ కలిగిన సరుకును స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న యజమానిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 24: బ్రేక్ డౌన్, ట్రిప్పింగులు జరిగినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్యాలయంలో సోమవారం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి నోడల్ ఆఫీసర్స్, సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్‌లు జరిగినప్పుడు ప్రతీచోట ప్రత్యామ్నాయ సరఫరా ఉండేవిధంగా చేయాలని సూచించారు. అలాగే పొడవాటి లైన్లు, ట్యాపింగ్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్(ఎఫ్‌పీఐ)లు అమర్చాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు వైఫల్యం చెందినప్పుడు వెంటనే వాటి స్థానంలో కొత్తవి మార్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, టి.మధుసుదన్, రాజుచౌహాన్, కె.కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 1, 2024 వరకు అభ్యర్థులు 17 యేళ్లు నిండాలని తెలిపారు. జూలై 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాలికను వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 24: మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని వేధించిన కేసులో నేరం రుజువైనందున పోక్సో చట్ట ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ. వేయి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధితురాలికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన సింగారపు దిలీప్.. తనను వివాహం చేసుకోవాలని, లేదంటే చనిపోతానని అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించేవాడు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 29న దిలీప్ హైదరాబాద్ నుంచి ఫోన్‌చేసి హైదరాబాద్‌కు వస్తే పెళ్లి చేసుకుందామని, రాకుంటే చనిపోతానని బెదిరించాడు. ఈ విషయంపై బాధితురాలు తల్లిదండ్రులకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ అశోక్ సాక్షులను ప్రవేశపెట్టగా కె.పరమేశ్వరి లైజన్ అధికారిగా వ్యవహరించారు. కేసు దర్యాప్తు అధికారులుగా సీఐ ఎ.మహేందర్, ఎస్సై వి.విజయ్‌కుమార్ వ్యవహరించారు. భరోసా లీగల్‌సెల్ అధికారి సీహెచ్. నీరజ కేసుకు సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

మెడికల్ వార్డులో విద్యుత్ అంతరాయం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తరుచూ జరుగుతూనే ఉంది. సోమవారం రాత్రి 6.30 గంటల నుంచి మెడికల్ వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంఎం ఈస్ట్, ఎంఎం వెస్ట్ రోగులంతా ర్యాంపు వద్దకు చేరుకున్నారు. సుమారు 60 మంది రోగులతోపాటు వారి అటెండెంట్లు చీకట్లోనే కాలం వెళ్లదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంజీఎం ఆస్పత్రిలో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడటం పట్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



నవభారత.. సాక్షరత

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది వయోజన నిరక్షరాస్యులు
- మొదటి విడతలో లక్ష మందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- సంపూర్ణ సాక్షరతకు ప్రత్యేక ఉల్లాస్ యాప్
- సాక్షర భారత్‌కు భిన్నంగా నవభారత్ సాక్షరత

హనుమకొండ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతలో భాగంగా వయోజనులందరినీ అక్షరాస్యులను చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు భారత విద్యామంత్రిత్వ శాఖ నవభారత్ సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్) కార్యక్రమాన్ని చేపట్టింది. చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, వయోజనులకు చదువు చెప్పాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పదిహేనేళ్లు నిండిన నిరక్షరాస్య యువతీ, యువకులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీని అమలులో ప్రభుత్వ ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషించబోతుండడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సహా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. వీరు ఆ గ్రామ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పించేలా కార్యాచరణ రూపొందిచారు.

వయోజన నిరక్షరాస్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,92,449 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో నవభారత సాక్షరతా కార్యక్రమం కింద 1,03,646 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. హనుమకొండ జిల్లాలో 1,12,739 మంది వయోజనులైన నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,200 మంది కాగా, స్త్రీలు 82,539 మంది. అయితే నవభారత్ సాక్షరతా కార్యక్రమం కింద మొదటి విడతగా 19,250 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. వరంగల్ జిల్లాలో 86,228 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,838 మంది కాగా, స్త్రీలు 55,390 మంది. ఈ జిల్లాలో మొదటి విడతా 19,808 మంది అక్షరాస్యులను చేస్తారు. జనగామ జిల్లాలో 66,419 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 23,151 మంది కాగా, స్త్రీలు 43,268 మంది. వీరిలో నుంచి మొదటి విడత 16,075 మందిని అక్షరాస్యులను చేస్తారు. ములుగు జిల్లాలో 25,473 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 8,825 మంది కాగా, స్త్రీలు 16,648 మంది. వీరిలో మొదటి విడతా 5,046 మందిని అక్షరాస్యులను చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 54,777 మంది నిరక్షరాస్యులు ఉండగా, వీరిలో పురుషులు 19,619 మంది, స్త్రీలు 35,158 మంది. వీరిలో మొదటి విడట 19,636 మందిని అక్షరాస్యులను చేస్తారు. మహబూబాబాద్ జిల్లాలో 1,46,813 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 55,643 మంది కాగా, స్త్రీలు 91,170 మంది. వీరిలో మొదటి విడతగా 23,831 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.



ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు

నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోనున్నది. ప్రధానోపాధ్యాయుడిని అక్షరాస్యత పర్యవేక్షకుడి (లిటరసీ సూపర్వైజర్)గా ఓ ఉపాధ్యాయుడిని శిక్షకుడిగా, మరొకరు సర్వేయర్‌గా ఎంపిక చేయనున్నారు. వీరితోపాటు ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. వీరంతా కలిసి వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పిస్తారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షల మంది పదిహేనేళ్లు పైబడిన వయోజన నిరక్షరాస్యులున్నారు. వీరిలో లక్ష మందిని మొదటి దశలో అక్షరాస్యులుగా చేస్తారు.

కోడ్ ముగిసింది.. ఇక జోరుగా..

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తికావడంతో ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి సెలవుల్లోనే ప్రారంభించి, కార్యకర్తల ఎంపిక, శిక్షణ పూర్తి చేయాలని నిర్ణయించారు. కోడ్ ముగియడంతో కార్యాచరణ మొదలు పెట్టారు. ముందుగా ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ తర్వాత అధిక జనాభా ఉన్న గ్రామాల్లో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి శిక్షణ ఇస్తారు. శతశాతం అక్షరాస్యతకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉల్లాస్ యాప్

కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఉల్లాస్ (అండ్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల కోడ్ సహాయంతో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉనికి, గుర్తింపు తదితర వివరాలు ఇందులో పొందుపరిచారు. తొలి విడతలో కొంత మందిని ఎంపిక చేసి అక్షరాలు నేర్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. కుటుంబసభ్యుల వివరాలు, నివాస ప్రాంతం తదితర అంశాలను పొందుపరుస్తారు. ఈ యాప్ ద్వారా ప్రాథమిక విద్య, డిజిటల్, ఆర్థిక, అక్షరాస్యత, వృత్తినైపుణ్యాలు, క్లిష్టమైన జీవన నైపుణ్యాలను అందిస్తారు. విభిన్న అభ్యాస వనరుల్లో నిమగ్నమవడానికి డిజిటల్ గేట్‌వేగా ఉపయోగపడుతుంది. ఆవాస పద్ధతిలో అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తిస్తారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో నిరక్షరాస్యులైన వయోజనులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

కలెక్టర్లు చైర్మన్లుగా..

నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆరు జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో కలెక్టర్ చైర్మన్‌గా, ఈడీవో మెంబర్ కన్వీనర్‌గా, వయోజన విద్య ఉపసంచాలకుడు లైజన్ అధికారిగా వ్యవహరిస్తారు. నవభారత సాక్షరతా పథకం అమలులో భాగంగా వివిధ రాష్ట్రాలు తమ సౌకర్యాన్ని బట్టి పేర్లను మార్చుకున్నాయి. మన రాష్ట్రంలో దీనిని ఉల్లాస్ నవభారత్ సాక్షరతగా అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 8,30,332 మంది వియోజనులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50వేల మందిని చేయాలని నిర్ణయించారు. నవభారత సాక్షరత కార్యక్రమం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులను వెచ్చిస్తుంది. జాతీయ నూతన విద్యావిధానం ప్రకారం వచ్చే ఐదేళ్లలో నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యం. వయోజన విద్యలో భాగంగా 2018 వరకు నిర్వహించిన సాక్షర భారత్ కార్యక్రమానికి భిన్నంగా వ్యక్తి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కొత్త కార్యక్రమాన్ని రూపొదించారు. లక్ష్యాన్ని అయిదు దశల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. 100 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు బోధనాభ్యసన సామాగ్రి సిద్ధం చేస్తున్నారు.

ఇలా నేర్పిస్తారు..

వయోజనులకు ఇట్టే అర్థమయ్యేలా సులభంగా చదువు చెప్పనున్నారు. ప్రత్యక్ష తరగతులు, రేడియో, టీవీ సహా సెల్‌ఫోన్‌ద్వారా పాఠాలు నేర్పుతారు. ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రధానంగా గణితంలో చతుర్విధ ప్రక్రియలు సహా జీవన సాఫ్యలత గురించి మనోవిజ్ఞానపాఠాలు చెబుతారు. అలాగే నేర్చుకున్న విషయాలపై పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతారు. ఎంపిక చేసిన నిరక్షరాస్యులను మొదటి 100 రోజుల్లో రాయడం, చదవడం చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పిస్తారు. 150మార్కులతో తుదిపరీక్ష నిర్వహించి ఉత్తీర్ణ సాధించినవారికి ధ్రువపత్రాలు ఇస్తారు. రెండో దశలో క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ పరిజ్ఞానం, చట్టాలపై అవగాహన పెంచేలా శిక్షణ ఇస్తారు. ఆరోగ్య పరిరక్షణ, పిల్లల పోషణ, విద్య, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పిస్తారు. మూడోదశలో 3-5 తరగతులు ప్రాథమిక విద్యగా, 6-8 తరగతులు మాధ్యమిక విద్యగా, 9-12 తరగతులను సెకండరీ విద్యగా అందించేందుకు చర్యలు తీసుకుంటారు. నాలుగో దశలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించే శిక్షణ ఇచ్చి, స్థానికంగా ఉపాధి అవకాశం కల్పిస్తారు. అయిదు దశలో శిక్షణ పొందిన వారితో స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందిస్తారు.

లక్షమంది అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం



టి. రమేష్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్, వయోజన విద్య

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది నిరక్షరాస్యులున్నారు. మొదటి విడతగా లక్షమందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం. నవభారత్ సాక్షరతా కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో సాక్షరతా మిషన్‌కు భిన్నంగా ఈ కార్యక్రమం పూర్తిగా ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పూర్తిగా స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో అమలవుతుంది. పాఠశాల, కళాశాల విద్యార్థులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తాం. ఇందుకు సంబంధించిన స్టడీ మెటీరియల్ కూడా సిద్ధమైంది. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో విద్యావంతులైనవారు, విద్యార్థులు అక్షరాస్యులైన ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయడం ద్వారా మన దేశాన్ని సంపూర్ణ అక్షరాస్యతగా మార్చాలి.

ప్రమాదపుటంచున లక్నవరం చెరువు

- తూములో కూలిన రాళ్లు
- మరమ్మతులు చేయిస్తున్న నీటిపారుదల శాఖ



నీళ్లు లేక వెలవెలబోతున్న లక్నవరం సరస్సు

గోవిందరావుపేట, జూన్ 24: ఉయ్యాల వంతెనలు, మధ్యలో దీవులు, చుట్టూ పచ్చని కొండలతో ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా ఉండే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం లక్నవరం సరస్సు ప్రమాదంలో పడింది. తూము లోపలి భాగంలో రాళ్లు కూలిపడగా.. ఇటీవల ఆ విషయాన్ని గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ లక్నవరం సరస్సు 8,794ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. సుమారు 300ఏళ్లక్రితం నిర్మించినట్టుగా భావిస్తున్న తూములలో గత కొన్నేళ్లుగా లీకేజీలు ఏర్పడ్డాయి. మూడు షెట్టర్లు కలిగిన తూములో ఓ షట్టర్ లోపల రాళ్లు కూలినట్లు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి తక్షణమే మరమ్మతు చేయకుంటే సరస్సులోకి పూర్తిస్థాయి నీటిమట్టం చేరి ఒత్తిడి పెరిగితే రాతికట్టడమైన తూము కూలిపోయే ప్రమాదముందని భావించారు. తక్షణ మరమ్మతు కోసం ప్రభుత్వానికి నివేదించగా రూ.22లక్షల నిధులు విడుదలవగా వెంటనే పనులు ప్రారంభించారు. పూర్తిగా రాతితో నిర్మించిన తూమును సనాతన పద్ధతిలోనే మరమ్మతు చేయాలని నిర్ణయించారు. కాకతీయుల కాలం నుంచి నైజాం పాలకుల వరకు అనేక కట్టడాలలో అవలంబించిన విధానాన్ని కొనసాగిస్తూ కూలిన రాళ్ల స్థానంలో అంతే వ్యాసార్థం కలిగిన రాళ్లను పేర్చి డంగు సున్నంతో ప్లాస్టరింగ్ చేస్తున్నారు. క్యూరింగ్ కోసం కరక్కాయ, బెల్లం కలిపిన ద్రావకాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ తరహా నిర్మాణంలో అనుభవం ఉన్న తమిళనాడుకు చెందిన నిర్మాణ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. వారం క్రితం ప్రారంభమైన పనులను జూన్ 30లోపు పూర్తి చేయనున్నారు. వర్షాలు కురిసి అకస్మాత్తుగా వరద ముంచెత్తితో పనులకు అటంకం కలిగే అవకాశముండగా తూముకు పై భాగంలో రింగ్ బండ్‌ను నిర్మించారు. కాగా, మరమ్మతు పనులకోసం సరస్సులోని నీటిని ఖాళీ చేయడంతో 1,945ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగిన సరస్సు డెడ్ స్టోరేజీ స్థాయిలో వెలవెలబోతూ దర్శనమిస్తోంది. వారాంతపు సెలవులు, విడిది కోసం లక్నవరం వస్తున్న పర్యాటకులు కుంటలను తలపిస్తున్న సరస్సును చూసి నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ స్పందించారు. 'తూము లోపల ఏర్పడిన గండిని గుర్తించి మరమ్మతు చేస్తున్నాం.. లేకుంటే భవిష్యత్‌లో పెను విపత్తు జరిగి ఉండేది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పరిస్థితిని నివేదిస్తున్నాం. 25న రాష్ట్రస్థాయి పరిశీలన బృందం లక్నవరం పరిశీలనకు రానుంది. రాష్ట్రంలో తొలిసారి ప్రయోగాత్మకంగా డంగు సున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాలతో తూముల మరమ్మతులు జరుగుతున్నాయి.. సఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురాతన రిజర్వాయర్లకు కూడా ఇదే పద్ధతిలో మరమ్మతు పనులు చేసే అవకాశముంది' అని పేర్కొన్నారు.



లక్నవరం చెరువు తూముకు మరమ్మతు చేస్తున్న తమిళనాడు కార్మికులు

వయోవృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలి



ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేకవార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామెర నర్సయ్య కోరారు. సోమవారం ఎంజీఎంలోని వయోవృద్ధుల విభాగాన్ని సందర్శించారు. అనంతరం వారికి అందిస్తున్న సేవలపై ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వివరించారు. వయోవృద్ధుల సౌకర్యం కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తే సౌలభ్యంగా ఉంటుందని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగులగాం నరసయ్య, కార్యదర్శి తేరాల యుగందర్, కార్యవర్గ సభ్యులు గంగారపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ములుగు రోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పన నోడల్ అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కంపెనీలకు చెందిన సుమారు 100 ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో 50, జేఎస్సార్ సన్‌సిటీ గ్రూప్‌లో 50 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. స్విగ్గీలో రూ.14 వేలతో పాటు రూ.3 వేల ఇన్సెంటివ్ ఉంటుందని, జేఎస్సార్‌లో ఒక్క ప్లాట్ బుక్ చేస్తే రూ.50వేలు కమీషన్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన 18 నుంచి 45 యేళ్ల మధ్య గల వయస్సు గల వారు 26న ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'ఇంటర్ సప్లిమెంటరీ'లో శివాని జయకేతనం



ఎ.హాసిని | బి. మమత | కె. కౌషిక్ | ఎం. సుష్మిత | జి. హన్సిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో శివాని విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు కరస్పాండెంట్ టి.స్వామి చెప్పారు. ఎంపీసీ ఫస్టియర్‌లో చీర్ల సాయిజ 468 మార్కులు, కె.మాధవి 468, ఎం.యశ్వంత్, వి.అజయ్, పి.జెమిని, కె.ఆకాంక్ష, జి.తరుణ్, బి.మనీష, ఆర్.రాజ, సల్మా, ఎ.హర్షిత్ సాయిలకు 467 మార్కులు సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో ఎం.సుష్మిత జి.హన్సిక, ఎ.హాసిని, బి.మమత, కె.కౌషిక్ 437 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్వామి ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్. సంతోష్‌రెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ ప్రజావాణికి 21 దరఖాస్తులు

హనుమకొండ టౌన్, జూన్ 24: వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి హనుమకొండ, వరంగల్ సర్కిల్‌లో 21 దరఖాస్తులు వచ్చాయి. కాగా హనుమకొండ సర్కిల్‌లోని హనుమకొండ రూరల్ డివిజన్‌లో 10, టౌన్ డివిజన్‌లో మూడు, మధ్యాహ్నం నిర్వహించిన సర్కిల్ కార్యాలయంలో ఒక దరఖాస్తు వచ్చినట్లు హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ పేర్కొన్నారు. వరంగల్ సర్కిల్‌లో 8 దరఖాస్తులు రాగా, బిల్డింగ్ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై ఫిర్యాదు చేశారన్నారు.

మానుకోటలో చోరీ సొత్తు రికవరీ

- 24 గంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు
- 1.906 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, జూన్ 24 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ విషయమై షాపు యాజమాని రున్వాల్ భన్సీలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఆదివారం క్లూస్‌టీం, పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బుక్కబజారులో నివాసముంటున్న చత్రి విజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలో గుర్ఖాగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జూవెలరీషాపు వెనుకభాగం నుంచి పైకప్పులోని పెంకులను తీసి షాపులోకి ప్రవేశించినట్లు చెప్పారు. షాపులో ఉన్న పెద్ద, చిన్న వెండి గిన్నెలు 33, వెండి దీపపు కుందులు 10, వెండి గ్లాసులు 15, చిన్న చెంచాలు 3, వెండి ప్లేట్‌లు 3, కుంకుమ వేసుకునే నాలుగు గిన్నెల సెట్‌లు 2 వెరసి మొత్తం 1.906 కేజీల వెండి అభరణాలను చోరీ చేసినట్లు చెప్పారు. వాటిని ప్లాస్టిక్ సంచిలో తీసుకుని వరంగల్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సహకారంతో ఉదయం పాత నేరస్తుడైన చత్రి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్ ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడని, నేరం రుజువు కావడంతో శిక్ష అనుభవించి ఇటీవలే బయటకు వచ్చినట్లు చెప్పారు. అ తర్వాత జూవెలరీషాపులో చోరీ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్‌కుమార్, సీఆర్పీ, జీఆర్పీ పోలీసులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోరీ వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్



7వ బ్లాకులో షీట్‌ఫైల్ అమరిక పనులు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

పూర్తయిన సీసీ బ్లాకుల పునరుద్ధరణ

వర్షంతో అన్నారం సరస్వతి బ్యారేజ్ మరమ్మతు పనులకు ఆటంకం

మహదేవపూర్ రూరల్ / మహదేవపూర్, జూన్ 24 : కుంగిన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు పూర్తి కాగా షీట్‌పైల్ అమరిక పనులు పూర్తి కావచ్చాయి. బ్యారేజీకి దిగువన సీసీబ్లాకులతో పాటు దాని కింద ఉన్న కంకర రాళ్లపై ఐరన్ నెట్ వేసే పనులు కొనసాగుతున్నాయి. మట్టినమూనాల సేకరణతో పాటు గ్రౌటింగ్ పనులు కొసాగుతున్నాయి.

సరస్వతి బ్యారేజ్ పనులకు ఆటంకం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సరస్వతీ బ్యారేజీకి బుంగలు ఏర్పడిన నేపథ్యంలో మరమ్మతు పనులు జరుగుతుండగా సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఆ పనులకు ఆటంకం కలిగింది. పుణేకు చెందిన కేంద్ర జల, శక్తి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల బృందం నాలుగు రోజులుగా చేస్తున్న పరిశోధనలను నిలిపేసి సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతీ బ్యారేజీకి వెళ్లారు. వాస్తవానికి ఆ బృందం మరోవారం రోజుల పాటు సరస్వతీ బ్యారేజీ వద్దే ఉండాల్సి ఉండగా పనులకు ఆటంకం కలగడంతో వారు సుందిళ్లకు వెళ్లాల్సి వచ్చింది. లీకేజీలు, సీపేజీలు లేకుండా చేయడానికి కెమికల్ గ్రౌటింగ్ తోపాటు జియోఫిజికల్ పరీక్షలకు ఆటంకం కలిగింది. కేవలం డ్రిల్లింగ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి.

అధికారులు అంకితభావంతో పని చేయాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, జూన్ 24: అధికారులందరూ సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతన పరిష్కరించాలని అధికారులను సూచించారు. సీఎం ప్రజావాణి దరఖాస్తులు జిల్లా సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించే ఏజెన్సీలు ఉద్యోగులకు సమయానికి ఈపీఎఫ్, జీతాలు, ఈఎస్ఐ లు అందుతున్నాయో పర్యవేక్షించి నివేదికను సమర్పించాలన్నారు. అనంతరం ఐడీఓసి కార్యాలయాన్ని పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్వహణకు నూతన టెక్నాలజీ

- పైలట్ ప్రాజెక్టుగా నిడిగొండ, స్టేషన్‌ఘన్‌పూర్ స్టేషన్లు
- ఒడిస్సాలో అధ్యయనం చేసిన ఎన్పీడీసీఎల్ బృందం

హనుమకొండ టౌన్, జూన్ 24: నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ తెలంగాణ లిమిటెడ్ కొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని 33 / 11 కేవీ సబ్ స్టేషన్లు, 33/11 కేవీ ఫీడర్లను రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కొత్త టెక్నాలజీ వలన సబ్ స్టేషన్లలో లోడ్, పవర్ ఫ్యాక్టర్, ట్రిప్పింగ్స్‌లు, బ్రేక్ డౌన్‌లు, ఎల్‌సీలు పూర్తిగా జరిగిన సమాచారం తెలుసుకోవచ్చు. ఈ కొత్త టెక్నాలజీ అమలుపర్చడానికి పైలట్ ప్రాజెక్టు కింద స్కోప్ స్పైండర్ అనే కంపెనీలకు రెండు సబ్ స్టేషన్లు, ఒకటి చిన్న పెండ్యాల, రెండు నిడిగొండ సబ్‌స్టేషన్లు ఇచ్చారని, జూలై 5 వరకు పూర్తి చేయాలని, వీరు ఇచ్చే సమాచారానికి అనుగుణంగా టెండర్లను పిలవనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ రెండు సబ్‌స్టేషన్లు పనితీరును బట్టి టీజీ ఎన్పీడీసీఎల్ మొత్తం టెక్నాలజీ అమలు పరుస్తాయని యాజమాన్యం పేర్కొంది. దీని వలన మానవరహిత సబ్ స్టేషన్లుగా మార్చవచ్చు. ఈ కొత్త విధానాన్ని అధ్యయనం చేయడానికి టెక్నికల్ బృందాన్ని నియమించారు. ఈ టెక్నికల్ టీమ్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ వి.మోహన్‌రావు, జి.శ్రీనివాస్. జీఎం ఐటీ కె.గౌతం రెడ్డి, జీఎం ఆపరేషన్ కె.అనిల్ కుమార్, డీఈ ఐటీ శ్రీకాంత్, ఏడీఈ స్కాడాలు ఉన్నారు. వీరు ఈ నెల 11, 12 తేదీల్లో ఒడిస్సాలో టాటా పవర్ వెస్ట్రన్ ఒడిస్సా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో అవలంబిస్తున్న విధి విధానాలను అధ్యయనం చేసి వచ్చారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు అబ్బాస్

జనగామ రూరల్, జూన్ 24: మహిళలు, నిరుద్యోగులు, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు ఎండి అబ్బాస్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అబ్బాస్ మట్లాడుతూ జనగామ పట్టణంలో ఇండస్ట్రీ క్యాడర్ గాని, పరిశ్రమలు గాని లేక ప్రజలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారని, వారికి పనికి ఆహార పథకం కింద జాబు కార్డు ఇచ్చి పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కళ్యాణం లింగం, బాల్నే వెంకటమల్లయ్య, పందిళ్ల కళ్యాణి, గౌసియా, రజిత, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై 28న విచారణ

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 24 : స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు ఈ నెల 28న విచారణ చేస్తామని ఇన్‌చార్జి డీపీవో అనిల్‌కుమార్ ప్రకటించారు. పంచాయతీ సెక్రటరీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని, ఇందుకు తమ వద్ద రికార్డులు, ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిగురు విజయ్‌కుమార్ చేశారని, ఈ మేరకు విచారణ జరుపుతామని ఆయన స్పష్టం చేశారు.

నేడు చాగల్‌లో రైతులకు అవగాహన సదస్సు

జఫర్‌గడ్, జూన్ 24 : ఖరీఫ్ పంటల సాగుపై మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణాధికారులు శిరీష, కీర్తి స్నేహ, అనిత, ప్రశాంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని జఫర్‌గడ్, లింగాలఘనపురం, స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు, రఘునాథ్‌పల్లి మండలాలకు చెందిన రైతులకు నిర్వహించే ఈ రైతు నేస్తం కార్యక్రమంలో ఖరీఫ్ పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సలహాలు సూచనలు చేస్తారన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అలాగే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడతారని అన్నారు. చాగల్‌లోని రైతు వేదిక భవనంలో నిర్వహించే అవగాహన సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఏఈవోలు కోరారు.

పూర్తికాని పనులు..
పట్టించుకోని పాలకులు

కోమల్ల పాఠశాలలో ఆగిపోయిన ప్రహరీ, స్టేజీ నిర్మాణం



హైస్కూల్ ఎదుట ప్రహరీ నిర్మించకుండా వదిలేసిన దృశ్యం



నూతన హైస్కూల్ భవనం ముందు నిర్మాణం పూర్తికాని స్టేజీ

రఘునాథపల్లి, జూన్ 24: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేనితనం వెరసి విద్యార్థులకు శాపంగా మారింది. చేపట్టిన పనులను పూర్తిచేయకుండా కాంట్రాక్టర్ అర్ధాంతరంగా వదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. రఘునాథపల్లి మండలం కోమల్లలో అంతకుముందు ఉన్న పాత హైస్కూల్ భవనాన్ని కూల్చి వేసి ఆ ప్రదేశంలో నూతన భవనం నిర్మించడంతో పాటు గ్రామీణ క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసేలా అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇందుకు గాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు-మన బడి కింద రూ.17.84 లక్షలు మంజూరు చేసింది. అయితే హైస్కూల్ భవనం మాత్రమే నిర్మించిన కాంట్రాక్టర్ ప్రహరీని విస్మరించారు. దాంతో పాటు పాఠశాల ముందు స్టేజీని నిర్మించకుండానే వదిలేశాడు. మరోవైపు పాత భవనం కూల్చివేయగా వెలువడిన పాత పునాది రాళ్లతో పాటు, ఐరన్, సాబాడి బండలను కాంట్రాక్టర్ అమ్ముకొని సొమ్ముచేసుకున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా కోమల్ల-కంచనపల్లి వెళ్లే దారిలో వాగు వద్ద జరుగుతున్న పనులకు ఇక్కడి పునాది రాళ్లను వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయినా పాలకులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనం చుట్టూ ప్రహరీతో పాటు పాటు స్టేజీ నిర్మించేటట్టు సత్వర చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌కుమార్



కేజీబీవీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ సుధీర్‌కుమార్

చిలుపూర్, జూన్ 24: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయ సిబ్బంది శ్రద్ధ పెట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో (వైద్యారోగ్యశాఖ జిల్లా ఉప అధికారి) డాక్టర్ సుధీర్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన రాజవరం కేజీబీవీని సందర్శించి విద్యార్థుల హెల్త్‌కు సంబంధించి నమోదు చేసిన రికార్డులతో పాటు, తరగతి గదులు, కిచెన్‌రూంను పరిశీలించారు. అనంతరం పాఠశాల సమీపంలో ఉన్న ఫకీరాతండాకు చేరుకుని ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని వర్షిణి కుటుంబాన్ని పరామర్శించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటి నుంచి తెచ్చుకునే తినుబండారాలను అనుమతించొద్దని సూచించారు. ఆపత్కాల సమయాల్లో స్థానిక ఏఎన్ఎంతో పాటు, ఆశా కార్యకర్తలకు సమాచారమందించి అత్యవసర చికిత్స పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుషాలి, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సోని, హెల్త్ సూపర్‌వైజర్లు విజయ, మంజులరాణి, ఏఎన్ఎంలు సంతోష, సునంద, సబిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



ధర్మాపురం పీఎస్‌కు టీవీని అందిస్తున్న ఉపాధ్యాయులు సరిత, రాజు

దేవరుప్పుల, జూన్ 24: మండలంలోని ధర్మాపురం ప్రాథమిక పాఠశాలకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు జి.సరిత, రాజు సోమవారం టీవీని బహూకరించారు. ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శివాజి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు టీవీ అనేది ఒక బోధన పరికరంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం ముడిదె రాము, జీపీ కార్యదర్శి అమరేందర్, ఉపాధ్యాయులు విజయ్‌పాల్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి



ఎంపిక పోటీల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుమన్

జఫర్‌గడ్, జూన్ 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జఫర్‌గడ్ ఎంపీడీవో సుమన్ అన్నారు. క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం సోమవారం తిమ్మంపేటలో విద్యార్థులకు మండల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడా పాఠశాలల్లో చేరడం వల్ల మంచి శిక్షణతో విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆయా క్రీడల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతారన్నారు. మండల, జిల్లా స్థాయిల్లో జరిగే పోటీల్లో ఉత్తమ నైపుణ్యాలను కనబర్చాలని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి ఎండి.పర్వేజ్, హైస్కూల్ హెచ్‌ఎం షారూన్, పీఈటీలు కొండా రవి, ఎం.యాదగిరి, పి.సుమలత, గట్టు మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, మండల స్థాయి పోటీల్లో ఆయా పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు ఆయా అంశాలపై పరీక్షలు, పోటీలను నిర్వహించారు.

నెల్లుట్లలో యువకుడి అదృశ్యం



నాగరాజు (ఫైల్)

లింగాలఘణపురం, జూన్24: మండలంలోని నెల్లుట్ల చాముండీ వైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న బాణాల నాగరాజు(25) అనే యువకు డు ఈనెల 20న అదృశ్యమయ్యాడు. జనగామ మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన నాగరాజు నెల్లుట్ల చాముండీ వైన్స్‌లో క్యాషియ ర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20న మళ్లీ వస్తాన ని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. బంధువులకు సమాచారం ఇచ్చినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి తిరుపతి సోమవారం లింగాలఘణపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై చింత రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంవల్లే వర్షిణి మృతి

గిరిజన విద్యార్థి సంఘం నాయకుల ఆరోపణ



కేజీబీవీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

చిలుపూర్, జూన్ 24 : ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే తొమ్మిదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని ఇస్లావత్ వర్షిణి మృతిచెందిందని గిరిజన విద్యార్థి సంఘం నేత భూక్య హుస్సేన్ నాయక్, బీఆర్ఎస్‌వి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి నాయక్ ఆరోపించారు. స్థానిక కేజీబీవీలో ఇటీవల వర్షిణి అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సోమవారం గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాలలో చేరిన రోజే తనిఖీలు సక్రమంగా చేపడితే వర్షిణి బతికి ఉండేదన్నారు. ఆమె మృతికి కారకులైన బాధ్యులపై చర్యలు తీసుకునేదాకా ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఈ విషయమై కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సోని ఫోన్లో ద్వారా డీఈవో రాముతో మాట్లాడించారు. తక్షణమే తగు విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా వెంకట్, భూక్య సిద్ధూనాయక్, భానోత్ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్యకు ఉపాధ్యాయుల సన్మానం



సమ్మయ్యను సన్మానిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

లింగాలఘణపురం, జూన్24: చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సోమవారం లింగాలఘణపురం కేజీబీవీ ప్రత్యేకాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సమ్మయ్య తన మనువరాళ్లను కేజీబీవీలో చేర్పించేందుకు పాఠశాలకు వచ్చారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



పల్లాను కలిసిన మండల బీఆర్ఎస్ నాయకులు

బచ్చన్నపేట, జూన్ 24: స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాగా మండల బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిశారు. వారిలో జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు బొడిగెం చంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, నాయకులు వేముల సాగర్‌గౌడ్, వడ్డేపల్లి మల్లారెడ్డి, ముశిని రాజుగౌడ్, బాలచందర్, కాపర్తి హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఉచితంగా సివిల్స్ కోచింగ్

జనగామ రూరల్, జూన్ 24: సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కోచింగ్ ఇస్తుందని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో కోచింగ్‌తో పాటు, వసతి ఖర్చులను ఇస్తారని తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల అభ్యర్థులు జూలై 3వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తేలు కాటుతో రైతు మృతి

జఫర్‌గడ్, జూన్ 24 : మండలంలోని సాగరం శివారు వడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి ముత్యాలు (46) అనే రైతు తేలు కాటుతో మృతి చెందాడు. ఈనెల 21న తన వ్యవసాయ బావి వద్ద పని చేసుకుంటున్న క్రమంలో ముత్యాలు చేతికి తేలు కాటు వేసింది. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ శీలం రవియాదవ్ తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంలో దుక్కిటెద్దు మృత్యువాత



విస్నూరులో మృతి చెందిన దుక్కిటెద్దు

పాలకుర్తి, జూన్ 24 : మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన పోలాస అనిల్ అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. వ్యవసాయ బావి వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగ తెగి ఎద్దుపై పడగా అక్కడికక్కడే మృతి చెందిందని, దీని విలువ రూ. 80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు అనిల్ విజ్ఞప్తి చేశారు.

కొర్రీలు లేకుండా రైతులందరికీ
రుణమాఫీ వర్తింపజేయాలి

బీఆర్ఎస్ మండల కో ఆర్డినేటర్ ఎండీ ఫిరోజ్

బచ్చన్నపేట, జూన్ 24: ఎటువంటి కొర్రీలు లేకుండా వ్యవసాయ రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ వర్తింప జేయాలని బీఆర్ఎస్ మండల కో ఆర్డినేటర్ ఎండీ ఫిరోజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు అప్పులు తీసుకున్నారని, రేషన్‌కార్డు ప్రామాణికం అని పెట్టి, ఇతర నిబంధనలతో రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జంతువధశాల బహిరంగ వేలం

జనగామ రూరల్, జూన్ 24: జిల్లా కేంద్రంలోని జంతువధశాలను బహిరంగ వేలం వేసినట్లు జనగామ మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో గల జంతు వధశాలను యేడాది కాలానికి బహిరంగ వేలం వేయడంతో సుద్దాల సురేష్ రూ. 2,45,000లకు వేలం దక్కించుకున్నారని అన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కొడకండ్ల, జూన్ 24: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కున్సోత్ సోమ్లనాయక్ తండ్రి గంగ్యానాయక్ అనారోగ్య కారణాలతో 3 రోజుల క్రితం మృతిచెందారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పాలకుర్తి ఇంచార్జి ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జిట్టబోయిన సోమన్న, మసురం రవీందర్, యాకేష్‌యాదవ్, శివ, శ్రీను, సుమన్, యాకు, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన శ్రీహరి, కావ్య



సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిసిన ఎంపీ కావ్య ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 24 : సీఎం రేవంత్ రెడ్డితో పాటు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను వారికి వివరించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న మాచెర్ల గణేశ్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 24 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచెర్ల గణేశ్ అన్నారు. సోమవారం మండలంలోని తానేదార్‌పల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తన సొంత డబ్బులను వెచ్చించి ఉచితంగా నోట్‌బుక్స్‌తో పాటు, ఇతర స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, రాజిరెడ్డి, పురుషోత్తం, శ్రీకాంత్, నవీన్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, గుండె రంజిత్, మాచెర్ల ప్రియాంక, హెచ్‌ఎం కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు న్యాయమైనవే

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 24: ఆర్టిజన్ కార్మికుల సమస్యలు న్యాయమైనవేనని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన ఆర్టిజన్ కార్మికుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాయని రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా టీఆర్‌కెవీఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్టిజన్ జాక్ చైర్మన్ పప్పు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీఆర్‌వీకేఎస్ యూనియన్ నుంచి 50మంది ఆర్టిజన్ కార్మికులు 327యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, 327 కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఈ.వి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

తరిగొప్పుల, జూన్ 24: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన చింతల గాలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని యూనిక్ యూత్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి 25 కేజీల బియ్యంతోపాటు ఇతర వంట సామగ్రి అందించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు మంచినీళ్ల రాకేష్ మాట్లాడుతూ గ్రామంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు సేవచేసేందుకు తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు మిండ్లపురం కరుణాకర్, బండ మధు తాటి రజినీకాంత్, పుర్మని రాజు, రవికుమార్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహచర ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం

రఘునాథపల్లి, జూన్ 24: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ గండె ప్రదీప్‌కు మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పిడి సాంబ, జిల్లా ఉపాధ్యక్షుడు కొన్నె సతీష్, ప్రధాన కార్యదర్శి గండ్ర నవీన్, రాసమల్ల మల్లేష్, కొయ్యడ రాజు, పిట్టల మహేష్, బిర్రు సతీష్, ముసిపట్ల ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

జూనియర్ డాక్టర్ల హెచ్చరిక ● ఎంజీఎంలో ఓపీ సేవల బహిష్కరణ



ఎంజీఎంలో నినాదాలు చేస్తున్న జూనియర్ డాక్టర్లు

వరంగల్ మెడికల్, జూన్ 24: సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో సమ్మె బాట పట్టినట్లు జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా నల్లబ్యాడ్జీలు, కండ్లకు గంతలు కట్టుకొని వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేసిన వైద్యులు.. ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుంచి సమ్మె బాటపట్టారు. ఎంజీఎంలో ఓపీ విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 9 గంటలకు ఎంజీఎంలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న జూనియర్ డాక్టర్లు.. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

అనంతరం జూనియర్ డాక్టర్ల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతీ నెల స్టైఫండ్ కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళితేగానీ నిధులు విడుదల కావడం లేదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే సరిపోదని, వాటిలో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉస్మానియా ఆస్పత్రి భవనం కూలిపోయే దశకు చేరుకుందని, వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేఎంసీలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయని, వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్ల పరిస్థితి కూడా ఏమాత్రం చెప్పుకోదగ్గవిగా లేవని, కేఎంసీలో మౌలిక వసతులు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.